క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ కేశవరావు

బూర్జ: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని మానవ అక్రమ రవాణా నిరోధిక విభాగం శ్రీకాకుళం ఎస్‌ఐ ఎస్.కేశవరావు అన్నారు. మండలంలోని కొల్లివలస కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ విద్యార్థులు సోదర భావంతో మెలగాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఏఎస్‌ఐ డి.రమణమూర్తి, హెచ్‌సీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

68 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు జానకిరామయ్య

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్–3లో భాగంగా బుధవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 68 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలను స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పలి జానకిరామయ్య చేపట్టారు. నలుగురికి అంతర కుసుములు ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి మే 8న శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో ఐఓఎల్ ఆపరేషన్లు చేయించనున్నారు. 23 మందికి దృష్టిలోపం ఉన్నందున ఉచితంగా ప్రభుత్వం కళ్లద్దాలు పంపిణీ చేస్తుందన్నారు. సాధారణ కంటి జబ్బులు ఉన్నవారికి ఉచితంగా మందులను సర్పంచ్ కె.పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వైకుంఠరావు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

హిరమండలం: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ వేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందించాలన్నారు. ప్రతీరోజు సాయంత్రం నిర్వహించే స్పందనలో సిబ్బంది హాజరై ప్రజలనుంచి వచ్చే ఆర్జీలను స్వీకరించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ బి.మురళీమోహన్, ఈఓపీఆర్డీ వేంకటేశ్వరరావు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

పాతపట్నం: మండలంలోని బడ్డుమర్రి పంచాయతీ కోనంగి గ్రామంలో అక్రమంగా 20 లీటర్ల నాటుసారాను తరలిస్తున్న నాయుడు ఆంజనేయులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మనాయుడు తెలిపారు. నిందితుడ్ని బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ దస్తగిరి, మొబైల్ టీమ్ ఎస్‌ఐ కళ్యాణి, నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

పాతపట్నం: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని పాతపట్నం సీహెచ్‌సీ వైద్యురాలు జి.అనిత అన్నారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో చిన్నారుల స్నాతకోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు తమ టాలెంట్‌ను ఇప్పటి నుంచే ప్రదర్శించడం గొప్పతనం అని కొనియాడారు. అనంతరం చిన్నారులకు వైద్యురాలు చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల డీన్ వి.నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు బి.ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బురిడికంచరాంలో గడ్డివాము దగ్ధం

పొందూరు: మండలంలోని బురిడికంచరాం గ్రామంలో బుధవారం సంభవించిన అగ్నిప్రమాదంలో సారిక ఆదినారాయణకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రజలు తెలిపారు. ప్రమాదంపై సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.10 వేల నష్టం జరిగినట్లు గుర్తించారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



మెళియాపుట్టి: పెద్దపద్మాపురంలో ఉపాధి వేతనదారులతో కలిసి మట్టిగంపను తలపై పట్టుకున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు సెల్యూట్ చేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు తేడా వివరించి జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: బగదలలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: మాతలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ముద్దాడుతున్న వృద్ధురాలు



బూర్జ: చిన్నలంకాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: కుర్మదాసుపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు



సరుబుజ్జిలి: వీరమల్లిపేట గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: తంప గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: చింతలపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: యారబాడులో స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: కిడిమిలో స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం పునరావాస కాలనీలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



బూర్జ: పాలవలసలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: బైదాలాపురంలో సంక్షేమ పథకాల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

బూర్జ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందజేస్తున్నారని, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ గడపకు ఆర్థిక తోడ్పాటు అందుతోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పాలవలస గ్రామంలో మూడో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని, ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.66 లక్షలు మంజూరు చేయడం జరిగిందని స్పీకర్ తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, స్థానిక సర్పంచ్ జల్లు అంభుజాక్షి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు గుమ్మడి రాంబాబు, జల్లు అప్పల స్వామినాయుడు, మామిడి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి నాగరాజు, తొత్తడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సారవకోట: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బైదాలాపురంలో ఎంపీటీసీ మెండ బాలచంద్రరావు నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ గౌరమ్మ తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించాలని ఇప్పటికే తెలియజేశానని, త్వరలో పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కోరుకొండ శంకరరావు, గద్దిబోయిన గోవిందరావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ కొండాల దేవేంద్ర, సచివాలయాల మండల కన్వీనర్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు గెల్లంకి వెంకటరావు, వెలమల సింహాచలం, గొర్లె ఢిల్లీరావు, తహసల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఏపీఎం గోవిందరాజులు, ఏపీఓ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంసలు



ఎస్పీ రాధిక చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఎస్పీ జి.శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో పలు కేసుల ఛేదనలో ప్రతిభ కనబర్చిన పోలీసులకు ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రశంసాపత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందజేశారు. రిపబ్లిక్ డే పురస్కారాల నాడు డీఎస్పీ జి.శ్రీనివాసరావు అందుబాటులో లేని కారణంగా.. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవాల్సిన ప్రశంసాపత్రాన్ని ఎస్పీ ఆయనకు అందజేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మిస్సింగ్ కేసుల ఛేదన, సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రతిభ కనబర్చిన శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు, ఒకటో పట్టణ, ఎచ్చెర్ల, పాతపట్నం, హిరమండలం, కోటబొమ్మాళి, బారువ, టెక్కలి, నరసన్నపేట, నందిగాం ఎస్‌ఐలు బలివాడ గణేష్, సత్యనారాయణ, కామేశ్వరరావు, నారాయణస్వామి, మహ్మద్ ఆలీ, బి.సత్యనారాయణ, ఎల్.రామకృష్ణ, వై.సింహాచలం, అమీద్ అహ్మద్ ఆలీలకు ఎస్పీ రాధిక ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

దేశం గర్వించదగ్గ ఇంజినీర్ విశ్వేశ్వరయ్య



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఇంజినీర్ జగదీశ్వరరావు

పాతపట్నం: దేశం గర్వించదగ్గ ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 61వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతపట్నం పీఆర్ డీఈఈ కార్యాలయం ఆవరణలో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి పి.రామరాజు, ఎస్.షణ్ముఖరావు, ఇంజినీర్లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఇంజినీర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులో మోక్షగుండం ఎంతో కృషి చేశారన్నారు. జ్యోతిర్లత, చిన్నారావు, తేజ, నీలకంఠం, హేమలత, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

రూ.1.33 కోట్లతో వంతెన నిర్మాణం

- శంకుస్థాపన చేసిన నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలోని బైదాలాపురం గ్రామానికి సమీపంలో వంశధార కాలువపై రూ 1.33 కోట్లతో వంతెన నిర్మాణానికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020లో వంతెన కూలిపోయిందని, దానిని పునర్ నిర్మించేందుకు పలు సాంకేతిక సమస్యలు అడ్డురావచ్చాయన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి డీఎంఎఫ్ గ్రాంట్ నుంచి రూ 1.33 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని, ప్రజలంతా ఆనందంగా ఉండాలనేది ఆయన కోరిక అన్నారు. వంతెనను ఏడాదిలోగా పూర్తిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటానన్నారు. వంశధార నీటిపారుదలశాఖ ఎస్‌ఈ డోల తిరుమలరావు మాట్లాడుతూ డీఎంఎఫ్ గ్రాంట్ నుంచి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాడిని ఎమ్మెల్యే కృషి ఉందన్నారు. గ్రామస్తులు కూడా వంతెన నిర్మాణ సమయంలో సహకారం అందించాలని కోరారు. గ్రామంలో మరమ్మతులకు గురైన బైదాలాపురం ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఎపీఐడీసీ ఈఈ కేవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. వంశధార నీటిపారుదలశాఖ ఈఈ డీవీ ప్రతాప్, డీఈఈ అనీల్‌కుమార్, సర్పంచ్ గౌరమ్మ, ఎంపీటీసీ మెండ బాలచంద్రరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ మహాసభలను విజయవంతం చేయండి



ప్రచారం నిర్వహిస్తున్న ఇఫ్టూ ప్రతినిధులు

ఆమదాలవలస: తిరుపతిలో జరగనున్న ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆమదాలవలసలో శ్రీకాకుళం జిల్లా ఇఫ్టూ కార్యకర్తలు, అరుణోదయ కళాకారులు, దళిత డప్పు కళాకారులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 16 ,17, 18వ తేదీల్లో నిర్వహించనున్న మహాసభలకు తరలిరావాలన్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ ఆవరణలో ఇఫ్టూ జాతీయ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గాశి శ్రీగణేష్, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిత్తిరి లక్ష్మణరావు, దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మ సంజీవరావు, డి.కె.ఎస్ జిల్లా నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


పొందూరు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి వి.మురళి బుధవారం తెలిపారు. కింతలి, బురిడికంచరాం, పొందూరు సచివాలయం-2, గోరింట, కోటిపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న సచివాలయ పోస్టులకు ఈ నెల 13వ తేదీ సాయంత్ర 5 గంటలు లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కొత్తూరు: మండలంలోని పారాపురం, దిమిలి, కలిగాం, గురండి గ్రామ సచివాలయాల పరిధిలో ఐదు గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పావని బుధవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 13 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పారాపురంలో క్లస్టర్ 4-బీసీ జనరల్, క్లస్టర్-11 బీసీ-ఈ మహిళ, దిమిలిలో క్లస్టర్-10 బీసీ జనరల్, కలిగాంలో క్లస్టర్-20 బీసీ మహిళ, గురండిలో క్లస్టర్-9 ఎస్టీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

సరుబుజ్జిలి కళాశాలకు రెగ్యులర్ లెక్చరర్లు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టుకు ఎం.నాగేంద్ర, ఇంగ్లిష్‌కు డి.రామకృష్ణను రెగ్యులర్ లెక్చరర్లుగా నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు బుధవారం తెలిపారు. రెగ్యులర్ అధ్యాపకులు రావడం వల్ల విద్యార్థులకు ఉత్తమ బోధన అందుతుందన్నారు. విద్యార్థులు తమ కళాశాలలో ప్రవేశాలు పొందాలన్నారు.

జాతీయ సాహిత్య సమ్మేళనానికి 'కుప్పిలి'కి ఆహ్వానం



ఆమదాలవలస: ఈ నెల 30న హైదరాబాద్ పటాన్ చెరులో జరగనున్న జాతీయ సాహిత్య సమ్మేళనంలో పాల్గొని, కవితాగానం చేసేందుకు ఆహ్వానం అందినట్లు ఆమదాలవలసకు చెందిన కవి కె.వి. రాజారావు మాస్టారుకు బుధవారం తెలిపారు. తెలుగు వెలుగు సాహిత్య వేదిక నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 116 మంది కవితలను ఎంపిక చేసి, సత్కరించనున్నట్లు ఎస్.వి.ఫౌండేషన్ నిర్వాహకులు ద్వారా ఆహ్వానపత్రం అందిందన్నారు. 'జింక, బాణం సంధిస్తే' అనే కవితను జాతీయ వేదికపై వినిపించనున్నట్లు పేర్కొన్నారు.

వేప కషాయంతో సస్యరక్షణ



నరసన్నపేట: వేప కషాయం తయారుచేసే పద్ధతులు రైతులకు వివరిస్తున్న జగన్



సరుబుజ్జిలి: రైతులకు ఉచితంగా పంపిణీ చేసిన విత్తనాలు

నరసన్నపేట: వేప కషాయంతో పైర్లలో చీడపీడలను నియంత్రించవచ్చని మండల ప్రకృతి వ్యవసాయం రీసోర్స్ పర్సన్ జగన్ అన్నారు. మండలంలోని మాకివలసలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. పెసర, మినప పంటల్లో వచ్చే పేనుబంక తెగులు నివారణకు వేప కషాయం చేసి పైర్లపై పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. వేప కషాయాన్ని తయారు చేసే పద్ధతులను రైతులకు వివరించారు. ఎకరాకు 10 లీటర్ల నాటు ఆవు మూత్రం, 10 కేజీల వేప ఆకు, ఒక కేజీ ఆవు పేడ, వీటన్నింటినీ మూడు రోజులపాటు మగ్గపెట్టి పంట మీద పిచికారీ చేస్తే ప్రయోజనం కలుగుతుందన్నారు. ఏఈఓ అమరావతి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సింహాద్రి, కమల తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం వృద్ధి

సరుబుజ్జిలి: నవధాన్యాలు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం రేవతి తెలిపారు. రావివలసలో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. 30 రకాల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ వండాన కృష్ణ, డీపీ బాబూజీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



పంచాయతీరాజ్ రోడ్డును ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ముద్దాడపేట జంక్షన్ నుంచి కణుగువలస వరకు రూ.3.63 కోట్ల వ్యయంతో నిర్మించిన పంచాయతీరాజ్ రోడ్డును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మండలంలో 20 గ్రామాలకు ఉపయోగపడే ఈ రోడ్డును త్వరితగతిన నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు పక్కా రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ గడపకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించేందుకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలుపుతూ బలసలరేవు వంతెన నిర్మాణానికి సీఎం జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. మండలంలో ఇసుకలపేట వద్ద నాగావళి నదిపై నిర్మించే ఈ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 87 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచ్ టొంపల ఉమ, మండల సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, పార్టీ నాయకులు మెట్ట ఆనందరావు, కూటికుప్పల సన్యాసిరావు, గురుగుబెల్లి ప్రభాకరరావు, సోమరాజు తేజేశ్వరరావు, గురుగుబెల్లి చంద్రయ్య, చేపాన కృష్ణ, గొంటి కృష్ణ, గురుగుబెల్లి అప్పలనాయుడు, గురుగుబెల్లి గిరి, పైడి మురళి, తమ్మినేని వేణు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.